ప్రభుత్వ భూములను కాపాడాలని నినాదాలు చేస్తున్న ఎల్లాపూర్ గ్రామస్తులు

ప్రభుత్వ భూములను కాపాడాలి

- ఎల్లాపూర్ గ్రామస్తుల ఆందోళన
- పట్టించుకోకుండా వెళ్లిన మంత్రి కొండా సురేఖ

వరంగల్, మార్చి 20 : హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూములు కాపాడాలని పలువురు గ్రామస్తులు బల్దియా బడ్జెట్ సమావేశం జరుగుతున్న సమయంలో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సమావేశం నుంచి బయటికి వచ్చిన మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముందే ప్రభుత్వ భూములను కాపాడాలని, అధికారుల తీరు నశించాలని నినాదాలు చేశారు. అయినా మంత్రి సురేఖ పట్టించుకోకుండా కారులో వెళ్లిపోయారు. దీంతో మంత్రి, ఎమ్మెల్యే, మేయర్ తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల విలువైన భూమిని కాపాడలేని ప్రజాప్రతినిధులు ఎందుకని మండిపడ్డారు.

కబ్జాదారులకు అధికారుల వత్తాసు..

ఎల్లాపూర్‌లోని సర్వే నంబర్ 316లో 4 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి ఉందని గ్రామస్తులు తెలిపారు. అందులో 2 ఎకరాల 20 గుంటల భూమిని 1972లో అంగడికి కేటాయించారని, అందులో దవాఖాన నిర్మించడంతో పాటు జీపీ నిధులతో బావిని తవ్వించారని తెలిపారు. అలాగే సర్వే నంబర్ 246లో 12 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, అందులో 2 ఎకరాల 12 గుంటల భూమిని చేపల ఉత్పత్తి కేంద్రం, కలగిరి బంగ్లా, గోదాములకు కేటాయించారని పేర్కొన్నారు. చేపల ఉత్పత్తి కేంద్రాన్ని 1973లో అప్పటి కేంద్రమంత్రి సుబ్రహ్మణ్యం ప్రారంభించారని, ఈ స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. 30 ఏళ్లుగా రెవెన్యూ రికార్డుల్లో అంగడి, చేపల ఉత్పత్తి కేంద్రం పేరుతో ఉండగా, కొంతమంది 2018లో ధరణి ద్వారా కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కలెక్టర్, గ్రేటర్ కమిషనర్, ఆర్డీవో, ఎంఆర్‌వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ భూమికి నాలా పర్మిషన్ ఇచ్చారన్నారు. వెంటనే నాలా పర్మిషన్‌ను రద్దు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

ఐకేపీ సీఏ ఆత్మహత్యాయత్నం

ఎల్కతుర్తి, మార్చి 20 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఐకేపీ సీఏ చిల్లా పద్మ తనను అకారణంగా సీసీ తిట్టారని మనస్తాపం చెంది బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మ ఐకేపీ మహిళా సమాఖ్యలో తిమ్మాపూర్ గ్రామ సీఏగా పనిచేస్తున్నది. అయితే కొన్ని నెలల క్రితం జ్వరంతో బాధపడడంతో వేరే అమ్మాయితో పని చేయించింది. తర్వాత సీఏ పద్మ కోలుకొని విధుల్లో చేరాక రాజీనామా చేయాలని ఐకేపీ సీసీ ఒత్తిడి తెచ్చారు. అంతేకాకుండా పద్మకు రూ. 2లక్షల లోన్ ఇప్పించి ఊరిలోని మహిళల రుణాలకు అనుసంధానం చేసి పద్మనే కట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పలు గ్రామాల్లో జరిగిన మహిళా సంఘాల సమావేశాల్లో సీఏ పద్మను అవమాన పర్చారు. దీంతో మనస్తాపం చెందిన పద్మ పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు పద్మను చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి కుమారుడు శ్రీకాంత్ తెలిపారు.

వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు

కమలాపూర్, మార్చి 20 : కమలాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా చాతీ, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పంతం సునీత మాట్లాడుతూ.. జిల్లాలో సంపూర్ణ సురక్ష కేంద్రం చేసేటువంటి కార్యక్రమాలను వివరించారు. హెపటైటిస్‌బీ, సిఫిలిస్, టీబీ, ఎయిడ్స్ బాధితుల పేర్లను సంపూర్ణ సురక్ష కేంద్రంలో నమోదు చేయిస్తే వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. వైద్యులు శ్రీనివాస్, నాగరాజు, అరుణ్‌కుమార్, రోహిత్, సిబ్బంది రవీందర్, జ్యోతి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలి..

శాయంపేట : క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని శాయంపేట పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణ అన్నారు. ఈ నెల 24న క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శాయంపేట మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ మల్లేశం, టీబీ నోడల్ పర్సన్ చలపతి, ఎస్‌టీఎల్ఎస్ జనార్దన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్
★ గోపాలపురం (HNK), 0% వడ్డీతో సులభ వాయిదాలతో సొంత ఇంటి కలను సాకారం చేసుకోండి. KUDA Approved గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్ (2BHK) సెల్: 6305185315.
NTW-000

CHANGE OF NAME
I Dhumala Srujana, W/o. Dhumala Ramesh, H.No.1-36. Mallampally Village and Mandal, Mulugu Dist. My son name and Surname Changed from DUMALA MEGHANATH to DHUMALA MYTHRINATH S/o Dhumala Ramesh for all purposes.

CHANGE OF NAME
★ I, SURESHKUMAR CHANCHAL (New Name), W/o. Vardelli Shravan Kumar, R/o. 15-6/1, Opp. Forest Office, Narsampet, Warangal, Rural, Pin-506 132, TS, have Changed My Name from CHANCHAL VARDELLI to SURESHKUMAR CHANCHAL for all purposes.
NT-330915

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

పూడికతీత పనులు వేగంగా చేయాలి

- భద్రకాళీ చెరువు మట్టి తరలింపుకు అంతర్గతదారులు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 20 : భద్రకాళీ చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి భద్రకాళీ చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సాగునీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సాగునీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈ మాట్లాడుతూ.. పూడికతీత మట్టిని తరలించేందుకు వెహికల్ పాసులు జారీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రవేశం, వెలుపలికి వెళ్లే మరో దారిని ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవన్నారు. రాత్రి వేళ మట్టిని తరలించేందుకు అదనపు సిబ్బందిని కేటాయించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టి తరలించేందుకు చెరువు మార్గంలో వీలైనన్ని అంతర్గతదారులు ఉండేలా చర్యలు చేపట్టి ఎక్కువ సంఖ్యలో వాహనాల ద్వారా మట్టి తరలించాలని పేర్కొన్నారు. సిబ్బంది పర్యవేక్షణకు రెండు రోజుల్లో పెద్ద కంటైనర్ ఏర్పాటు, తాగునీరు, కుర్చీలు సమకూర్చాలన్నారు. విడుతల వారీగా విధులు నిర్వర్తించేందుకు అక్కడ తగిన సిబ్బందిని నియమించాలన్నారు. రెండు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని, అలాగే వీలైనన్ని విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలింపునకు ప్రత్యామ్నాయ రోడ్డు సిద్ధం చేయాలన్నారు. సోమవారం నుంచి రాత్రి వేళల్లోనూ మట్టిని తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో పాల్గొన్న టెండర్ దారులతో మట్టి తరలింపుపై మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, ఎంవీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వేసవిలోగా పనులు పూర్తి చేయాలి
- మంత్రి కొండా సురేఖ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా ఎస్‌టీపీల కోసం వెంటనే స్థలాలు కేటాయించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి యూజీడీ, భద్రకాళీ చెరువు పూడికతీత పనులు, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్షించారు. యూజీడీ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గ్రేటర్‌లోని 66 డివిజన్లను 11 జోన్లుగా విభజించామని కన్సల్టెన్సీ ప్రతినిధులు తెలిపారు. 11 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో 9 ఎస్‌టీపీ నిర్మాణం కోసం సర్వే చేశామని, మరో నాలుగు ఎస్‌టీపీల కోసం స్థలం కేటాయిస్తే వెంటనే సర్వే పూర్తి చేసి డీపీఆర్‌ను సమర్పిస్తామని కన్సల్టెన్సీ ప్రతనిధులు వివరించారు. డీపీఆర్ బాధ్యతలు చేపట్టిన బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టీపీ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరంలో 2025 జనాభా దామాషా ప్రకారం ప్రణాళికలు చేస్తున్నామని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే వివరించారు. తాగునీటి ఎద్దడిపై మంత్రి సురేఖ పలు ఆదేశాలు చేశారు. గ్రేటర్ తోపాటు మండలానికో ప్రత్యేక అధికారిని నియమించి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య మంత్రికి తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలి : సీపీ సన్‌ప్రీత్‌సింగ్

సుబేదారి, మార్చి 20 : చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ముందస్తు సమాచారం సేకరించడమే లక్ష్యంగా పనిచేయాలని సీపీ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూకబ్జాలకు పాల్పడే వారు, రౌడీషీటర్ల సమాచారం సేకరించాలని ఆదేశించారు. పాస్‌పోర్టు విచారణ త్వరగా పూర్తి చేయాలని, ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పార్థసారథి, రాజు, గురుస్వామి, శేఖర్, సంజీత్, చంద్రమోహన్, డీఏవో ఇషాక్ పాల్గొన్నారు.

నిట్ డైరెక్టర్‌ను కలిసిన సీపీ..

సీపీ ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధిని కలిశారు. నిట్‌లోని డైరెక్టర్ చాంబర్‌లో సీపీ డైరెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే సీపీని జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సఖీ సెంటర్ కౌన్సిలర్, కో ఆర్డినేటర్ హైమావతి, కల్యాణి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 20 : ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు శుభవార్త. భద్రాచలంలో ఏప్రిల్ 6న జరగబోయే శ్రీ సీతారాముల వారి కల్యాణానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకే పంపించే ఏర్పాటు చేస్తున్నామని ఆర్ఎం విజయభాను తెలిపారు. గురువారం వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ పోస్టర్లు ఆవిష్కరించారు. స్వామివారి తలంబ్రాలు ఒక్కో ప్యాకెట్‌కు రూ.151 అని, ఆన్‌లైన్ బుకింగ్ కోసం http://tgsrtclogistics.co.in సంప్రదించాలని లేదా అన్ని బస్టాండ్ లాజిస్టిక్స్ సెంటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9154298759, 9154298763, 9154298761 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లీకేజీతో దేవాదుల నీళ్లు వృథా..

పైపులైన్ వాల్వ్ లీకేజీతో వృథాగా పోతున్న నీళ్లు

శాయంపేట, మార్చి 20 : పైపులైన్ నుంచి దేవాదుల నీరు లీకేజీ అవుతున్న ఘటన జోగంపల్లి శివారులోని చెరువులో గురువారం వెలుగులోకి వచ్చింది. చలివాగు దేవాదుల పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో జోగంపల్లి శివారులోని చెరువులో ఉన్న పైపులైన్ గేట్‌వాల్ నుంచి నీళ్లు వృథాగా పోతున్నాయి.

స్పెషల్ సమ్మరీ రివిజన్ నిరంతర ప్రక్రియ

హనుమకొండ మార్చి 20 : స్పెషల్ సమ్మరీ రివిజన్ నిరంతర ప్రక్రియ అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎలక్టోరల్ డ్రాఫ్ట్ ప్రకారం మొత్తం ఓటర్లు 5,08,379మంది కాగా, ఇందులో ఆడిషన్స్ 5,485, డిలీషన్స్ 866 ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వేర్వేరు బూతులలో కుటుంబసభ్యుల పేర్లు నమోదు అవుతున్నాయని, ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని అందరి ఓట్లు ఒకే పోలింగ్ బూతులో ఉండేలా చూడాలని ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఈవీ శ్రీనివాస్ రావు, ఎండీ మెహల్, బీజేపీ నుంచి రావు అమరేందర్‌రెడ్డి, సీపీఎం నుంచి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి శ్యామ్, వైసీపీ నుంచి రజినీకాంత్, బీఎస్పీ నుంచి మణి, బీఆర్ఎస్ నుంచి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 20 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా శుక్రవారం వడ్డేపల్లి సబ్ స్టేషన్ డాక్టర్స్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, న్యూ శాయంపేట సబ్ స్టేషన్ విద్యుత్ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ఏరియాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

నిట్‌లో 'అసెంట్'పై అంతర్జాతీయ సదస్సు

హనుమకొండ చౌరస్తా, మార్చి 20 : నిట్ రసాయన ఇంజినీరింగ్ విభాగం వజ్రోత్సవాల సందర్భంగా 'అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అండ్ నానో టెక్నాలజీ' అసెంట్-2025 అంతర్జాతీయ సదస్సును బీఆర్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో మొదటి రోజు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ఏఆర్‌సీఐ డైరెక్టర్ విజయ్, ఐఐసీహెచ్ఈ అండ్ ప్రొఫెసర్, ఐసీటీ ముంబై వైస్ ప్రెసిడెంట్ పరాగ్ గోగటే, నిట్ రసాయన ఇంజినీరింగ్ విభాగ హెడ్ విద్యాసాగర్, కన్వీనర్లు రాజమోహన్, లీలా మనోహర్, రమ్య మాట్లాడారు. అసెంట్ కార్యనిర్వాహక కన్వీనర్ రాజమోహన్ స్వాగత ప్రసంగం చేస్తూ విభిన్న రంగాల్లో పరిశోధన, సహకారంతో స్థిరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రొఫెసర్ విద్యాసాగర్ పరిశ్రమల పురోగతికి విభాగం చేస్తున్న కృషిని వివరించారు. ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి దేశం 2070 నాటికి నెట్-జీరో కార్బన్ లక్ష్యాన్ని సాధించడానికి పరిశోధకుల పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. అనంతరం అసెంట్ పరిశోధనా సావనీర్ విడుదల చేశారు. సుమారు 200 మంది పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

25న శాయంపేట షాపింగ్ కాంప్లెక్స్, అంగడి వేలం

శాయంపేట, మార్చి 20 : శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 25న షాపింగ్ కాంప్లెక్స్, అంగడి(వారాంతపు సంత) వేలం ఉంటుందని పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ గురువారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఏడు షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్ సంత వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు షాపింగ్ కాంప్లెక్స్‌కు డిపాజిట్ రూ.10వేలు, అంగడికి డిపాజిట్ రూ.30 వేలను 24వ తేదీలోగా చెల్లించాలన్నారు. 25న జీపీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. పాట దక్కించుకున్న వారు సగం సొమ్మును అదే రోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తండ్రి మందలించాడని ఎలుకల మందు తాగి కొడుకు ఆత్మహత్య

పూర్ణచందర్(ఫైల్)

ఐనవోలు, మార్చి 20 : తండ్రి మందలించాడని కొడుకు ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంథిని గ్రామానికి చెందిన కుక్కల సంపత్ చిన్న కుమారుడు పూర్ణచందర్(25) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆరు నెలల క్రితం యాక్సిడెంట్ కాగా ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే ఆటోను రిపేర్ చేయించాలని తల్లిదండ్రులతో 20 రోజులుగా గొడవ పడుతున్నాడు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తర్వాత ఆటో రిపేర్ చేయిస్తామని చెప్పినా వినడకుండా తండ్రితో గొడవపడి ఈ నెల 16న రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం ఎలుకల మందు తాగానని కాజీపేట నుంచి వేరే వ్యక్తి ఫోన్ ద్వారా తండ్రికి సమాచారం అందించాడు. తండ్రి వెంటనే అక్కడి చేరుకొని పూర్ణచందర్‌ను ఎంజీఎం దవాఖానలో చేర్చాడు. పరిస్థితి విషమంగా మారడంతో హనుమకొండలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో తరలించాడు. అక్కడి వైద్యుల సూచనతో ఈ నెల 19న హైదరాబాద్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఏసీఎస్ డైరెక్టర్ కల్యాణి రాజీనామా

హసన్‌పర్తి, మార్చి 20 : వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్ మెరుగుర్తి కల్యాణి తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామ పత్రాన్ని పీఏసీఎస్ సీఈవో పరమేశ్, డీసీవో సంజీవరెడ్డికి అందజేశారు. రెండేళ్లుగా పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేశ్‌గౌడ్ సొసైటీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, సొసైటీలో జరిగిన అవినీతిపై ప్రశ్నించినందుకు తనపై కుట్రలు చేస్తూ మీటింగ్‌లో తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. తనతో పాటు మిగతా డైరెక్టర్లు సైతం అసంతృప్తితో ఉన్నారన్నారు.

నేడు డయల్ యువర్ హనుమకొండ డీఎం

హనుమకొండ చౌరస్తా, మార్చి 20 : ఈనెల 21న హనుమకొండ డిపో పరిధిలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం ధరమ్‌సింగ్ తెలిపారు. జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట పరిధిలోని గ్రామాల ప్రజలు డిపో అభివృద్ధికి, బస్సు సర్వీసులపై తమ అభిప్రాయాలను 99592 26049 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు.

నేటి నుంచే ఇంగ్లిష్, మ్యాథ్స్ మూల్యాంకనం

హనుమకొండ చౌరస్తా, మార్చి 20 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రం క్యాంపు నంబర్ 20లో ఇంగ్లిష్, మ్యాథ్స్ మూల్యాంకనం ఈ నెల 22కు బదులుగా 21వ తేదీ నుంచే ప్రారంభమవుతుందని డీఐఈవో గోపాల్ తెలిపారు. అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులు కేటాయించిన అధ్యాపకులను రిలీవ్ చేయాలని కోరారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- గ్రేడింగ్ విధానానికి స్వస్తి..
- 100 మార్కులకు రాత పరీక్ష
- జిల్లాలో పరీక్ష రాయనున్న 12,061 మంది విద్యార్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 20 : నేటి నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హాల్ టికెట్లను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. జిల్లాలో 12,061 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, 67 సిట్టింగ్ స్క్వాడ్లు, 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 600 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు డీఈవో వాసంతి తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పిల్లలు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేలా టీచర్లు, తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.

గ్రేడింగ్ విధానానికి స్వస్తి..

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇప్పటివరకు ఉన్న గ్రేడింగ్ విధానానికి బోర్డు స్వస్తి పలికింది. గతంలో అంతర్గత పరీక్షలకు(ప్రాజెక్టులు, రాతపనికి) 20 మార్కులు, వార్షిక పరీక్షలకు 80 మార్కులు ఇచ్చేవారు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 20కి 20 మార్కులు వేస్తుండగా ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు అంతర్గత పరీక్షలకు మార్కులుండవు. ఒక్కో సబ్జెక్టు పరీక్ష 100 మార్కులకు నిర్వహించనున్నారు.

బీసీల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు

హనుమకొండ, మార్చి 20 : రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని విస్మరించిందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు అన్నారు. గురువారం సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి రూ.11405 కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో రూ. 20వేల కోట్లు కేటాయిస్తామనే హామీని కాంగ్రెస్ సర్కారు తుంగలో తొక్కిందన్నారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీలకు గత బడ్జెట్‌లో 3.2 శాతం, ఈ బడ్జెట్‌లో 3.7 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించిన విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని హితువు పలికారు. నాయకులు రమేశ్, సతీశ్, విద్యార్థి నాయకులు వినయ్‌చారి, గణేశ్ పాల్గొన్నారు.

వర్ధంతి వారోత్సవాలను జయ